భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL

14, నవంబర్ 2026, శనివారం భారత్ సమాచార్

నర్సాపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. హెడ్ కానిస్టేబుల్ మృతి



భారత్ సమాచార్, మెదక్ జిల్లా: నర్సాపూర్ పట్టణ పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. న్యూ క్లాసిక్ గార్డెన్స్ సమీపంలో వేగంగా వచ్చిన గుర్తుతెలియని కారు రెండు బైక్‌లను ఢీకొట్టడంతో మెదక్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మహమ్మద్ తాహెర్ (54) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో ఆయన కుమారుడు మహమ్మద్ ఖాజా మొయినుద్దీన్ (19)తో పాటు మరో బైక్‌పై ఉన్న చిగురు ప్రదీప్ (27), తలారి నవీన్ (27) తీవ్రంగా గాయపడ్డారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యూ క్లాసిక్ గార్డెన్స్‌లో జరిగిన ఓ శుభకార్యానికి మహమ్మద్ తాహెర్ తన కుమారుడితో కలిసి హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన తర్వాత ఇద్దరూ బైక్‌పై ఇంటికి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో రాత్రి సుమారు 11:15 గంటల సమయంలో నర్సాపూర్ నుంచి సంగారెడ్డి వైపు వేగంగా వెళ్తున్న గుర్తుతెలియని కారు వారి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న తాహెర్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన కుమారుడు ఖాజా మొయినుద్దీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

మొదటి బైక్‌ను ఢీకొట్టిన తర్వాత కారు అదుపుతప్పి కొంతదూరంలో వస్తున్న మరో బైక్‌ను కూడా ఢీకొట్టింది. దీంతో రామచంద్రాపురం గ్రామానికి చెందిన చిగురు ప్రదీప్, తలారి నవీన్ తీవ్రంగా గాయపడ్డారు. ఒకే కారు రెండు బైక్‌లను ఢీకొట్టడంతో నలుగురు ప్రమాదానికి గురయ్యారు. క్షతగాత్రులను వెంటనే 108 అంబులెన్స్‌లో నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డిలోని ధరణి ఆసుపత్రికి, సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు.

ప్రమాద సమాచారం అందుకున్న నర్సాపూర్ పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి వివరాలు సేకరించారు. మృతి చెందిన మహమ్మద్ తాహెర్ మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి భార్య సజీదా జబీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

మరోవైపు ప్రమాదానికి కారణమైన కారు, దాన్ని నడిపిన డ్రైవర్‌ను గుర్తించేందుకు పోలీసులు ప్రత్యేకంగా గాలిస్తున్నారు. ప్రమాదం జరిగిన పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. కారు ఏ దిశగా వెళ్లింది, దాని వివరాలు ఏమిటనే అంశాలపై

ఆధారాలు సేకరిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వారిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ఈ ఘటనతో స్థానికంగా విషాదం నెలకొంది. ఈ సందర్భంగా నర్సాపూర్ పోలీసులు వాహనదారులకు కీలక సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనాలు నడిపేటప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, తమతో పాటు రోడ్డుపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం కలిగించకుండా బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

© 2026 Bharath Samachar